క్లుప్తంగా

నేడు ఓటరు జాబితాపై సమీక్ష

కడ్తాల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికల నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల గురించి సమావేశం జరగనుందని ఎంపీడీఓ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు హాజరై.. ఓటర్ లిస్ట్, కేంద్రాల గురించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.

30న మంచాలలో..

మంచాల: డ్రాఫ్ట్ ఓటరు జాబితా పై ఈ నెల 30న రాజకీయ పార్టీల నాయకులతో మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీఓ బాలశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 12 సమీక్ష జరగనుందని, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితా సవరణ, అభ్యంతరాల గురించి చర్చించనున్నామని పేర్కొన్నారు. సమావేశానికి రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కడ్తాల్: సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ గంగాధర్ కోరారు. సాలార్‌పూర్ గ్రామంలో కెమెరాల ఏర్పాటుకు స్థానిక నాయకుడు నేనావత్ రమేశ్ నాయక్.. శుక్రవారం సీఐ గంగాధర్‌కు రూ.20 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను సన్మానించారు. ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, కానిస్టేబుల్ రాంకోటి ఉన్నారు.

డీజేలకు అనుమతి లేదు

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

కడ్తాల్: చవితి నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలతో పాటు సౌండ్ సిస్టమ్, వాహనాన్ని స్వాధీనం చేసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం ఠాణాలో డీజే నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలు వినియోగించరాదని చెప్పారు. నిమజ్జన ప్రక్రియను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని, రాత్రి పది గంటల లోపు పూర్తి చేయాలని సూచించారు. ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, డీజే నిర్వాహకులు ఉన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక



నిర్వాహకులతో మాట్లాడుతున్న దాత

కడ్తాల్: దేవాలయాలు మన ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గానుగుమార్లతండా గ్రామ పరిధి పోచమ్మగడ్డతండాలో నిర్మాణంలో ఉన్న తుల్జాభవానీ మాత ఆలయాన్ని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించి మాట్లాడారు. హామీ మేరకు ఆలయానికి రూ.1 లక్ష విరాళం అందజేశానని తెలిపారు. మరింత సహకారం ఇస్తానని చెప్పారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దాతను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు బీచ్యానాయక్, నరేశ్, రాజు, శ్రీను, రతన్, శివ, మహేశ్ పాల్గొన్నారు.

సవరణ తప్పనిసరి

మంచాల: ఓటరు జాబితాను తప్పనిసరిగా సవరణ చేయాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ ఎంవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచాల గ్రామంలోని 1వ వార్డు ఓటరు లిస్టులో ఉండాల్సిన పేర్లు.. ఇతర వార్డులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం చెప్పినట్లు వార్డుల ప్రకారం జాబితా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. స్థానికంగా లేని వారి పేర్లను కూడా లిస్టులో చేర్చారని ఆరోపించారు. నాయకులు అమరేందర్‌రెడ్డి, హరీశ్, రాజేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు రూ.18 వేలు చెల్లించాలి

కడ్తాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆశల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశల జీతాలు పెంచకుంటే ఉద్యమం చేపడతామన్నారు. అనంతరం ఆశ వర్కర్ల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలిగా జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా సబిత, ఉపాధ్యక్షులుగా స్వరూప, భారతమ్మ, సహాయ కార్యదర్శులుగా అనిత, పద్మ, బుచ్చమ్మ, కార్యవర్గ సభ్యులను నియమించారు.



పీఏసీఎస్ వద్ద క్యూ లైన్‌లో రైతులు



పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు, సిబ్బంది

సాగు పనులు వదిలి.. యూరియా కోసం తరలి

కర్షకులకు ఎరువుల కష్టాలు
- ఉదయం నుంచే పీఏసీఎస్ వద్ద క్యూ
- నీరసించి, స్పృహతప్పిన రైతులు
- పోలీసుల పహారాలో పంపిణీ

రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. విస్తతంగా కురుస్తున్న వర్షాలతో సాగు పనుల్లో బిజీగా ఉండాల్సిన కర్షకులు.. యూరియా కోసం దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. డిమాండ్ మేరకు ఎరువులు లభ్యం కాకపోవడంతో రేయింబవళ్లు పీఏసీఎస్, ఫర్టిలైజర్ షాపు ఎదుట క్యూ కడుతున్నారు.

యాచారం: యూరియా కోసం యాచారం పీఏసీఎస్ కార్యాలయం వద్ద అన్నదాతలు శుక్రవారం తెల్లవారు జామునుంచే బారులు తీరారు. ముందు వరుసలో ఉంటే.. త్వరగా అందుతుందనే ఆశతో యాచారం, మొండిగౌరెల్లి, మాల్, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద, గునుగల్, గడ్డమల్లయ్యగూడ గ్రామాలను ంచి పెద్ద సంఖ్యలో సాగర్‌రోడ్డుపై ఉన్న పీఏసీఎస్ కార్యాలయానికి తరలివచ్చారు. తమవంతు కోసం ఎదురు చూశారు. ఉదయం నుంచి లైన్లో ఉన్నప్పటికీ.. మధ్యాహ్నం వరకు యూరియా లోడ్ లారీ రాకపోవడంతో పలువురు మహిళా రైతులు స్పృహ తప్పి పడిపోయారు. తీవ్ర రద్దీతో ఉద్రిక్తికంగా మారే అవకాశం ఉండటంతో పీఏసీఎస్‌కు చేరుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు.. సీఐ నందీశ్వర్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. రైతులను సముదాయించారు. తాగునీటిని సరఫరా చేయించారు. యూరియా కోసం వందలాది మంది వస్తా రని తెలిసి కూడా.. పీఏసీఎస్ సిబ్బంది కనీస తాగునీటి సౌకర్యం కల్పించలేదని రైతులు ఆగ్రహం వ్య క్తంచేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత 500 బస్తాల లోడ్‌తో రావడంతో.. రైతులకు టోకెన్లు ఇ చ్చి, యూరియాను పంపిణీ చేశారు. యూరియా కొ రత, రైతుల ఇబ్బందుల గురించి ఇంటెలిజెన్సి పోలీసులు ఆరా తీశారు. వివరాలు సేకరించారు. ఇదే వి షయమై మండల వ్యవసాయాధికారి రవినాథ్‌ను వివరణ కోరగా.. శనివారం సాయంత్రం లోగా మ రో 550 బస్తాల యూరియా రానుందని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి 'ఐక్యత' విరాళం



విరాళం అందజేస్తున్న సుంకిరెడ్డి తదితరులు

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని టాస్క్ సీఓఓ, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రాంనుంతల గ్రామం పరిధి చిన్నతండాలో నిర్మాణంలో ఉన్న తుల్జామాత దేవాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రూ.2 లక్షల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, నాయకులు జింతనాయక్, పిక్లనాయక్, పరమేశ్, బన్సిలాల్, యాదయ్య, బాస్కర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు జైపాల్ రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు సుంకిరెడ్డి.. ఉప్పునుంతల మండలం తిరుమాలాపూర్‌లోని ఆయన నివాసంలో జైపాల్‌రెడ్డిని పరామర్శించారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ ఖాద్రిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: నూతన తహసీల్దార్ మహ్మద్ ఫయాం ఖాద్రిని.. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపకుడు మెకానిక్ బాబా ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారితో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, కాంగ్రెస్ నాయకులు శ్రీనునాయక్ తదితరులు తహసీల్దార్‌ను సత్కరించారు.

రాయితీపై సాగు పనిముట్లు

కడ్తాల్: ఎస్ఎంఏఎం(సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) స్కీం కింద రాయితీపై 2025- 26 ఏడాదికి రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, పనిముట్లు మంజూరయ్యాయని మండల వ్యవసాయ శాఖ అధికారి కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న పీకే యంత్రం- ఎస్టీ 1, గడ్డిబేలర్- ఎస్టీ 2, జనరల్ 2, బ్యాటరీ ఫుట్ మాన్యువల్ ఆపరేటెడ్ స్ప్రేయర్- జనరల్ 129, ఎస్సీ 25, ఎస్టీ 19, పవర్ నాప్సాక్ ప్రేయర్- జనరల్ 22, ఎస్సీ5, ఎస్టీ 3, పవర్ వీడర్- జనరల్ 1, బ్రష్ కట్టర్- జనరల్ 2, ఎస్టీ1, పవర్ టిల్లర్- జనరల్1, ఎస్టీ1 రోటవేటర్- జనరల్ 7, ఎస్సీ 2, ఎస్టీ 1, సీడ్‌కం ఫర్టీ డ్రిల్- జనరల్ 1, ఎస్టీ 1, బండ్ ఫార్మర్- జనరల్ 1, డిస్కహ్యారో, కల్టివేటర్, ఎంబీ ప్లౌ, కేజీవీల్స్, రోటో ప్లడర్- జనరల్ 9, ఎస్సీ 2, ఎస్టీ1 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరికరాలు ఎస్సీ,ఎస్టీ రైతులకు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీతో అందజేయనున్నామన్నారు. దరఖాస్తుతో పాటు, పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు, పాస్‌ఫొటో, ట్రాక్టర్‌తో నడిచే పనిముట్లు కావల్సిన వారు ట్రాక్టర్ ఆర్సీలను జతపరిచి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు.

విద్యార్థులకు కొత్త అధ్యాయం

ఇబ్రహీంపట్నం: ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు.. జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది పలకనున్నారని ప్లూరల్ టెక్నాలజీ డైరెక్టర్ డా.భాను ప్రకాశ్‌రెడ్డి, శ్రీ దత్త విద్యా సంస్థల చైర్మన్ జి.పాండు రంగారెడ్డిలు అన్నారు. 2025- 26 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన వారికి శుక్రవారం ఒరియెంటేషన్ డే కార్యక్రమాన్ని శేరిగూడలోని కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో సీఎండీ దేవేంద్ర విక్రమ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సైంథిల్‌కుమార్, డా.మధు సూదన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిందండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి

ఘనంగా క్రీడాదినోత్సవం



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, ఉపాధ్యాయుడు మల్లేశ్, విజేందర్, కరుణాకర్, అజ్ర, స్వప్న, అరుణ, రత్నకుమారి ఉన్నారు.



ఇబ్రహీంపట్నం: పవన్‌పురి కాలనీలో పూజలు అందుకుంటున్న గణపయ్య

భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్యకు మూడవ రోజు శుక్రవారం భక్తజనం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పండ్లు, ఫలహారాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తి పాటలతో అలరింపచేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. –సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: హనుమాన్ యూత్ గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నం: మంగల్‌పల్లిలో మహామ్మాయి దేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ఆమనగల్లు: శివశక్తి యూత్ గణనాథుడు



ఇబ్రహీంపట్నం: బృందావన్ నగర్‌లో..

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొరత

- తప్పుకప్పి పుచ్చుకునేందుకు కాంగ్రెస్‌పై నిందలు
- మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత ఆరోపించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సరిపడా యూరియా సరఫరా చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్రం ప్రభుత్వంపై నిందలు వేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రాష్ట్రానికి 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 5.72 లక్షల మె.ట. మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ రైతులను ఆదుకోవడానికి కాంగ్రెస్ సర్కార్ చిత్తశుద్ధితో పని చస్తుందని చెప్పారు. సమావేశంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మార్కెట్ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, బ్లాక్ కార్యదర్శి కృష్ణ, మాజీ ఎంపీపీ ధనుంజయ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఐఎన్‌టీయుసీ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు కృష్ణ, ఫరీద్, మల్లయ్య, అలీం, శ్రీనునాయక్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

అబ్దుల్లాపూర్‌మెట్: మైత్రీగోకులం కాలనీ- 1 లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఉప సర్పంచ్ చెరుకు కావ్య, కాలనీ అధ్యక్షుడు మోహన్‌ల ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్య ఉందని, అవుట్‌లెట్ లేకపోవడంతో మురుగు జలాలు ఇళ్ల మధ్యనే ఉంటున్నాయని తెలిపారు. దీంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. గ్రామంలోని డ్రైనేజీ పైపులైన్‌కు కలిపే విధంగా లైన్ తీయించాలని కోరారు. అధ్వాన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. సర్వీస్ రోడ్డు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీవాణికి ఆదేశాలు జారీ చేశారని కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివశంకర్‌గౌడ్, ఫరీద్, నవ్యకాంత్‌గౌడ్, కాలనీ ప్రధాన కార్యదర్శి ఎల్.రాధిక పాల్గొన్నారు.

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

- రైతులు నానో యూరియానే వాడాలి
- మండల వ్యవసాయాధికారి రేణుక

ఆమనగల్లు: సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాతో రైతులకు చాలా మేలు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని తలకొండపల్లి మండల వ్యవసాయాధికారి రేణుక చక్రవర్తిని అన్నారు. నానో నేల సారాన్ని కాపాడుతూ.. దిగుబడిని పెంచేందుకు సహకరిస్తుందని చెప్పారు. శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు. రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. యూరియాను అధికంగా వాడటం వలన నేలసారం దెబ్బతింటుందని, పంట ఉత్పత్తి వ్యయం పెరుగుతుందని చెప్పారు. యూరియా ఒక ఎకరానికి 45 కిలోలు వాడాల్సి ఉండగా.. నానో 500 మి.లీ. వాడితే చాలని పేర్కొన్నారు. పంట నెల రోజుల వయసు ఉన్న సమయంలో నానో యూరియాను ఆకులపై పిచికారీ చేయడం వలన మొక్కలు.. అవసరమైన నత్రజని పదార్థాన్ని సులభంగా గ్రహిస్తాయని, దీనివలన 10 నుంచి 15 శాతం దిగుబడి పెరిగే అవకాశం ఉందని చెప్పారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

చెరువుల సర్వేకు చర్యలు



పెద్దకుంటను పరిశీలిస్తున్న ఏఈ మహేందర్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: మండలంలోని చెరువులు, కుంటలపై ఫిర్యాదులు అందాయని, ఈ నేపథ్యంలో వాటి సర్వేకు చర్యలు చేపట్టామని ఇరిగేషన్ ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పెద్దకుంట, ఎలిగకుంట, దేవర చెరువు, కుమ్మరి కుంటలను పరిశీలించి మాట్లాడారు. ఎడతెరిపి లేని వర్షాలతో చెరువుల పరిస్థితిని తెలుసుకునేందుకు పర్యటిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదులు చేసిన వ్యక్తులు కూడా తమతో పాటు రావాలని, ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని కోరారు. ఎలిగకుంటలోకి వచ్చే ఓవర్‌ఫ్లో మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని బటర్‌ఫ్లై వెంచర్ నిర్వాహకులకు ఆయన సూచించారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఇబ్రహీంపట్నం యూనిట్ నూతన కార్యవర్గాన్ని, సంఘం సర్వసభ్య సమావేశంలో శుక్రవారం స్థానిక వాసవి భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. విజయప్ప, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా రాంరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా యాదమ్మ, యాదయ్య, సెక్రటరీగా ప్రతాప్‌శర్మ, జాయింట్ సెక్రటరీగా నర్సింహ్మా, కోశాధికారిగా వసంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నారాయణ, పబ్లిసిటీ సెక్రటరీగా బాలకిష్టయ్య, జిల్లా కౌన్సిలర్లుగా అశోక్‌కుమార్, వెంకట్‌రెడ్డిలను నియమించారు. సంఘం నాయకులు కోట్ల అశోక్‌కుమార్, జగదీశ్వర్, గోపాల్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ్మారావులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం

- భైరాన్‌ఖాన్ చెరువు వద్ద క్రేన్ల ఏర్పాట్లు
- పనులు పర్యవేక్షించిన అధికార యంత్రాంగం
- సీసీ కెమెరాలతో పోలీసుల నిఘా పటిష్టం



చెరువు వద్ద అందుబాటులో ఉన్న క్రేన్లు

అబ్దుల్లాపూర్‌మెట్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నిమజ్జనోత్సవాలకు నగర శివారు మండల పరిధి ఇనాంగూడ భైరాన్‌ఖాన్ చెరువు ముస్తాబయింది. అందుకు తగిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. శుక్రవారంతో మూడో రోజు కావడంతో ఈ గంగమ్మ ఒడికి ఎల్బీనగర్, వనస్థలిపురం, చింతల్‌కుంట, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట ప్రాంతాల నుంచి గణపతి విగ్రహాలు తరలి వస్తున్నాయి. కాగా.. నిమజ్జన ఏర్పాట్లను ఈ ఏడు కాస్త ఆలస్యంగా మొదలు పెట్టడం గమనార్హం.

3 క్రేన్లు, 2 జేసీబీలు

పక్షం రోజుల పాటు జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. 3 క్రేన్లు, 2 జేసీబీలు, విద్యుత్ దీపాలు, పోలీసు సహాయ కేంద్రాలు, సీసీ కెమెరాలతో నిఘా, తాత్కాలిక టాయిలెట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు.

గుర్రపుడెక్క, వ్యర్థాల తొలగింపు

నిమజ్జనం నేపథ్యంలో చెరువులో పరుచుకున్న గుర్రపుడెక్క, వ్యర్థాలను జేసీబీల సహాయంతో తొలగింపచేయించారు. అనంతరం వాటిని ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలించారు. చెరువు వద్ద రోడ్డును మట్టి, కంకర పోసి చదును చేయించారు. ఇదిలా ఉండగా.. నిమజ్జనం కోసం వచ్చే వాహనాలతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. నిమజ్జనం అనంతరం ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి, తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ శ్రీవాణి పేర్కొన్నారు.

గుర్లకుంట చెరువు వద్ద

కడ్తాల్: మండల కేంద్రం గుర్లకుంట చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. శుక్రవారం పోలీసులు, జీపీ అధికారులు చెరువు పరిసర ప్రాంతాలతో పాటు, నిమజ్జన ప్రదేశాన్ని చదును చేయించారు. కట్టపై స్తంభాలకు విద్యుత్ దీపాలను అమర్చారు. జీపీ కార్యదర్శి అల్లాజీ, ఎఎస్‌ఐ బాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది రాంకోటి, రాజశేఖర్, శ్రీధర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు